క్లుప్తంగా

రోడ్డు మరమ్మతుకు వితరణ



రామకృష్ణకు రూ.20వేల సాయం అందజేస్తున్న చందు

మునగపాక : పూడిమడక రోడ్డులో గోతులను పూడ్చేందుకు సొంత నిధులను ఖర్చు చేస్తున్న ఆడారి రామకృష్ణకు కేకే డెవలపర్స్ అధినేత కాంగ్రేగుల చందు తనవంతు సాయంగా గురువారం రూ.20 వేలు అందించారు. పూడిమడక రోడ్డు మరమ్మతులకు గురికావడంతో రాకపోకలు సాగిస్తున్న వారి ఇబ్బందులను తొలగించేందుకు తిమ్మరాజుపేటకు చెందిన ఆడారి రామకృష్ణ తన సొంత నిధులతో గోతులు పూడుస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా రామకృష్ణకు ఆర్థికంగా చేయూత అందించి సేవా నిరతి చాటుకున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



జగనన్న గోరుముద్ద పరిశీలిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : జగనన్న గోరుముద్ద పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని గురువారం ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట హైస్కూల్ హెచ్ఎం సూర్యనారాయణ, ఈవోఆర్డీ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన చెంగల



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు

పాయకరావుపేట : నామవరంలో లారీ ఢీ కొట్టి మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు గురువారం పరామర్శించారు. గత నెల 29న గ్రామానికి చెందిన బొట్టా కృష్ణ (40), పక్కుర్తి అప్పారావు (60) లారీ ఢీ కొట్టడంతో మృతిచెందిన విషయం విదితమే. బాధిత కుటుంబ సభ్యులను చెంగల వెంకట్రావు పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి అండగా వుంటానన్నారు.

సచివాలయంలో రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: మండలంలో ఉపమాక సచివాలయాన్ని ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. స్పందనలో వచ్చిన దరఖాస్తులు, మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు, ఇతర అర్జీలను వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టి సత్వరం నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు, గ్రామంలో పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించాలన్నారు. చేదోడు లబ్ధిదారుల గ్రీవెన్స్ స్వీకరించాలన్నారు.

ఘనంగా కల్యాణోత్సవాలు

ఎస్.రాయవరం : శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ మాధవ స్వామి నిత్యహోమాలతో వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు.

‘నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతున్నారు’



ఆర్డీవోను కలిసిన జగన్నాథపురం రైతులు

నక్కపల్లి : మండలంలో జి.జగన్నాథపురం గ్రామంలో సర్వే నంబరు 149/2 ,150/1,2 151/1, 2, తదితర సర్వే నంబర్లలో సుమారు 20 ఎకరాల జిరాయితీ భూములను తరతరాల నుంచి తామే సాగు చేసుకుంటున్నామని రైతులు ఆర్డీవో జయరామ్‌కు మొర పెట్టుకున్నారు. గురువారం వైస్ ఎంపీపీ వీసం నానాజీ ఆధ్వర్యంలో జగన్నాథపురం, డొంకాడ గ్రామాలకు చెందిన రైతులు నారపు రెడ్డి కుమారి, పులిబంటి బాబూరావు, వరహాలు, అప్పారావు, క్రిష్ణ, చందిన నాగమణి, మంగరాజు తదితర రైతులు ఆర్డీవోను కలిశారు. ఈ భూములు తమవేనని, తాము కొనుగోలు చేశామంటూ చంద్రా సుందర రావు అనే వ్యక్తి రెవెన్యూ అధికారుల ద్వారా తమకు నోటీసులు జారీ చేయించారన్నారు. ఇప్పటివరకు పలు పర్యాయాలు నోటీసులు అందుకోవడం జరిగిందన్నారు. తహసీల్దార్ కార్యాలయం వారు రమ్మని నోటీసు ఇచ్చిన ప్రతిసారి తాము కార్యాలయానికి వస్తున్నామని, కానీ భూములు తమవని చెప్పుకుంటున్న రైతు సుందరరావు మాత్రం రావడం లేదన్నారు. పన్నులు చెల్లిస్తూ 30 ఏళ్ల క్రితమే పట్టాదారు పాసు పుస్తకాలు కూడా పొందడం జరిగిందని రైతులు తెలిపారు. అసలు రైతు రాకుండా వేరొకరిని పంపించి తమకు నోటీసులు జారీ చేయిస్తున్నారని, తమను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. భూములు తమవేనని చెప్పుకుంటున్న వ్యక్తి ఒకసారి కూడా భూముల జోలికి రాలేదన్నారు. 40 ఏళ్లనుంచి ఈ భూములు తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. పూర్వీకుల నుంచి సంక్రమించాయన్నారు. ఈ విషయంపై తమను ప్రతి మూడు మాసాలకోసారి ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. ఇరు పార్టీలకు నోటీసులు ఇచ్చి ప్రత్యర్థి పార్టీ వారు కూడా వస్తేనే తాము కార్యాలయానికి వస్తామన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం పూర్తిగా పరిశీలించి ఇరువర్గాలతో చర్చలు ఏర్పాటు చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

మాదక ద్రవ్యాల బారిన పడొద్దు



అడ్డురోడ్డులో డ్రగ్స్ నివారణపై మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

ఎస్.రాయవరం : మాదక ద్రవ్యాల బారిన పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని నక్కపల్లి సీఐ నారాయణరావు సూచించారు. అడ్డురోడ్డు ముఖ్య కూడలిలో అవగాహన కల్పిస్తూ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. యువత ఎక్కువగా డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ప్రతి ఒక్కరు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను తెలుసుకోవాలని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం ఇస్తే నివారణ చర్యలు చేపడతామన్నారు.

మాఘ పౌర్ణమికి ఏర్పాట్ల పరిశీలన

మాఘపౌర్ణమి జాతరను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలని సీఐ నారాయణ రావు అన్నారు. రేవుపోలవరం తీరం సమీపంలో గురువారం సీఐ స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించి, పార్కింగ్ ప్రాంతంలో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొత్త రేవుపోలవరం సర్పంచ్ మల్లే లోవరాజు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల : మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దీని పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నర్సీపట్నం విద్యుత్ శాఖ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు, తాళ్లపాలెం ఏఈ బీఎల్‌వీ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కన్నూరుపాలెం, తీడ, ఆనందపురం, చెరకాం, కచ్చర్లపాలెం, లాలం కొత్తూరు, చిన్నయ్యపాలెం, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం, సింగవరం గ్రామాల్లో వ్యవసాయం, ఇళ్లకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. అలాగే రామన్నపాలెం ఫీడర్ పరిధిలోని రామన్నపాలెం, శెట్టిపాలెం, దుంగవానిపాలెం, జెడ్ గంగవరం, ఎరకన్నపాలెం, ధర్మవరం, వెంకటాపురం, చినరాచపల్లి, వెంకన్నపాలెంలోను, భీమబోయిన పాలెం ఫీడర్ పరిధిలోని రాజుపేట, భీమబోయినపాలెం, గండిపేట, చింతలూరు(మాకవరపాలెం), సన్ రే ఫీడర్(కోటవురట్ల), తోటకూరపాలెం(రావికమతం) క్వారీలకు కూడా నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

వివాదాలకు తావులేకుండా రీసర్వే జరగాలి

- ఆర్డీవో జయరామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరామ్

నక్కపల్లి : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రీసర్వే (జగనన్న భూహక్కు) కార్యక్రమం వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని నర్సీపట్నం ఆర్డీవో జయరామ్ సూచించారు. గురువారం ఆయన నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు సాగుచేసుకుంటున్న భూములను పూర్తి స్థాయిలో సర్వేచేసి వారికి శాశ్వతమైన భూ హక్కు కల్పించడం, సరిహద్దు వివాదాలు, భూముల విస్తీర్ణంలో తేడాలు సరిచేసి రైతులకు న్యాయం చేయడం కోసమే ఈ రీ సర్వే జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని సర్వే సిబ్బంది పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావుండకూడదన్నారు. రైతుల జిరాయితీ భూములతోపాటు, ప్రభుత్వ భూములను కూడా గుర్తించి హద్దులు నిర్ణయించాలన్నారు. చాలా ఏళ్ల తర్వాత జరుగుతున్న కార్యక్రమం కావడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ భూములు పరిరక్షణ విషయంలో ఎంతో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మ్యూటేషన్లు, వెబ్‌ల్యాండ్‌లో నమోదు, డిజిటల్ సిగ్నేచర్ కాకపోవడం వంటి విషయాల్లో రైతులను ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరించొద్దన్నారు. మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీరజ, పాయకరావుపేట తహసీల్దార్ జయప్రకాష్, డీటీ అశోక్, సర్వేయరు మూర్తి పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మునగపాక : బాలికలు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ చూపాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు రక్తహీనత లోపం కారణంగా ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే 10 నుంచి 19 సంవత్సరాలలోపు ఉన్న బాలికలు శరీరంలో జరుగుతున్న మార్పుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, హైస్కూల్ హెచ్ఎం సూర్యనారాయణ, మహిళా పోలీసులు వరలక్ష్మి, శ్రావణి, ఏఎన్ఎం దేవకి పాల్గొన్నారు.

104 వైద్య శిబిరం

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట పంచాయతీ సర్పంచ్ మొల్లేటి దేవీ చంద్ర కోరారు. గంగాదేవిపేటలో గురువారం నిర్వహించిన 104 వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి కారణంగా గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వైద్య శిబిరాలు దోహదపడతాయన్నారు. ఏఎన్ఎం జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని గాజువాక రోడ్డులో వెలసిన మరిడిమాంబ అమ్మవారి మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. ఉత్సవంలో రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, ఎంపీటీసీ లాలం శ్రీను, కొమ్మోజు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాయకరావుపేట : మండలంలో గల శ్రీరాంపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ అనకాపల్లి ఇ.ఇ. (ఆపరేషన్ డివిజన్) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్‌లో పరిధిలో గల 11 గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు

జూదాలకు దూరంగా ఉండాలి

మునగపాక : గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎస్ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో గురువారం మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తీర్థమహోత్సవాల్లో భాగంగా పేకాట, కోడిపందాలు, లాటరీ, బల్లాటలాడితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఈ విషయమై అవగాహన పెంచాలన్నారు. అలాగే గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు జరగాలన్నారు. అనధికారికంగా మద్యం విక్రయాలు జరగకుండా చూడాలన్నారు.

300 మందికి వైద్య సేవలు



వాడనర్సాపురంలో ఉచిత వైద్య శిబిరం

రాంబిల్లి : వాడనర్సాపురం గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గీతం ఆసుపత్రి సౌజన్యంతో పాస్టర్ సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద్యులు వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు వి.కిరణ్‌కుమార్, వి.ఎలీషా పాల్గొన్నారు.

కొండకర్ల ఆవలో చిత్తడినేలల దినోత్సవం



ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): కొండకర్ల ఆవ ప్రాంతంలో గురువారం ప్రపంచ చిత్తడినేలల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పక్షులు, చేపలు తదితర స్టాల్స్ విశాఖ ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, స్థానిక మత్స్యకార సంఘాల నేతలు ఏర్పాటు చేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 1000 మంది విద్యార్థులు హాజరై తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి అనంత్‌శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కొత్త నాగవరంలో రాజశేఖరరెడ్డి తీర్థం



నాగవరంలో మహానేత రాజన్న విగ్రహం

మునగపాక : మండలంలోని కొత్త నాగవరంలో ఈ నెల 4వ తేదీన రాజశేఖరరెడ్డి తీర్థం ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు తెలిపారు. ఏటా మాఘ పౌర్ణమి సందర్భంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. 4వ తేదీన ఉదయం రాజన్న విగ్రహం వద్ద నివాళులర్పించే కార్యక్రమంతో తీర్థం ప్రారంభమవుతుందన్నారు. అదే రోజు మహిళలతో కోలాటాలు, సేవా కార్యక్రమం, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తీర్థ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అప్పారావు కోరారు.

వైభవంగా పుష్పయాగం



శ్రీపాండురంగ స్వామికి పుష్పయాగం

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానంలో గురువారం పుష్పయాగం నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, పుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి పూజలు నిర్వహించారు. ఈవో వెంకటాద్రి తీర్థ ప్రసాదాలు అందించారు.

తులసీనగర్‌లో నేడు ‘గడప గడపకు’

యలమంచిలి : మున్సిపాలిటీ తులసీనగర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

అద్దె భవనాలతో ప్రభుత్వానికి నష్టం

తుమ్మపాల : అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక ప్రభుత్వ స్థలాలు పట్టణంలో ఉన్నప్పటికి ప్రైవేటు భవనాలలో కార్యాలయాలను నిర్వహించడంబాధాకరమన్నారు. మరమ్మతులకు గురైన ప్రభుత్వ భవనాలకు తక్కువ ఖర్చుతో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావచ్చని సూచించారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలు అడ్డుకుంటాం

- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం



వీసం రామకృష్ణ

నక్కపల్లి : ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే విధంగా నక్కపల్లి మండలంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలు, సముద్రపు ఇసుక తరలింపును అడ్డుకుంటామని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో చందనాడ, బుచ్చిరాజుపేట, మూలపర, అమలాపురం, నల్లమట్టిపాలెం, నెల్లిపూడి, గునిపూడి, డీఎల్‌పురం, బంగారయ్యపేట, వేంపాడు, పాటిమీద, బోయపాడు గ్రామాల్లో ఉన్న కొండల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపి పక్క మండలాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు లేఅవుట్లకు, హేచరీలకు, కంపెనీలకు తరలిస్తున్నారన్నారు. ఇలా తరలించిన గ్రావెల్, ఇసుక ద్వారా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారన్నారు. దేవవరం, రమణయ్యపేట, గుల్లిపాడు, గ్రామాల నుంచి పోలవరం కాలువ మట్టిని సయితం తరలించుకుపోతున్నారన్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో ప్రొక్లెయిన్లను ఏర్పాటు చేసి వందలాది ట్రాక్టర్లపై గ్రావెల్ తరలిస్తున్నారన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ప్రభుత్వాదాయానికి గండి పడడమే కాకుండా చెడ్డపేరు వస్తోందన్నారు. త్వరలోనే తాను ఎంపీపీ, జెడ్పీటీసీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలసి గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించి వాహనాలను పట్టుకుని అధికారులకు అప్పగించడం జరుగుతుందన్నారు.

పెదపాడు బాలికకు న్యాయం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య నాయకులు పరమేశ్వరి

అచ్యుతాపురం(అనకాపల్లి): పెదపాడు బాలికను మోసం చేసిన కొండకర్ల యువకుని విషయంలో దర్యాప్తు ముమ్మరం చేసి బాలికకు న్యాయం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. ఆమె గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మోసం చేసిన యువకునికి ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని, యువకుని తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని కోరారు. మూడేళ్లుగా బాలికను అన్ని రకాలుగా దోచుకొని పెళ్లి విషయం వచ్చేసరికి ముఖం చాటేయడం, పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడం దారుణమని, ఈ విషయంలో మహిళా సంఘాలు కచ్చితంగా పోరాడుతాయని తెలిపారు. బాలిక బంధువులు, మహిళా సమాఖ్య నాయకురాలు కె.లక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

వేధింపులకు గురైన మహిళకు ఎమ్మెల్యే పరామర్శ

పాయకరావుపేట : మండలంలో గల పి.ఎల్.పురం గ్రామంలో ఇంటి స్థలం కోసం వీఆర్వో వేధింపులకు గురైన దళిత వివాహిత మహిళను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల్ని వేధించే వారు ఎంతటివారైనా సరే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వీఆర్వోను విధుల నుంచి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. బాధిత మహిళకు తక్షణమే ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి హౌసింగ్ లోన్ మంజూరు చేయాలని మండల తహసీల్దార్‌తో అక్కడ నుండి ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే స్థలం మంజూరు చేయడం జరుగుతుందని, ఇంటి నిర్మాణానికి రుణం కూడా మంజూరు చేయడం జరుగుతుందని ఆమెకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, లీడ్ క్యాప్ రాష్ట్ర డైరెక్టరు వేమగిరి కళ్యాణి లక్షణ్, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, తూము రమణ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

యలమంచిలి : విద్యార్థులు పరిసరాల శుభ్రత విధిగా పాటించాలని హెచ్ఎం శోభారాణీ అన్నారు.పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజారోగ్యంపై స్థానిక సచివాలయ సిబ్బందితో కలసి గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివాహాలు, యుక్త వయస్సులో కలిగే మార్పులు, రక్త హీనత, రుతుచక్రం సమస్యలపై బాలికలకు వివరించి తగు జాగ్రత్తలు వివరించారు. హెచ్ఎం శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఆరోగ్యంగా దృఢంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య సూచనలు పాటించాలని తెలిపారు.

సర్పంచ్‌కు నివాళులు



సర్పంచ్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందిన కొరుప్రోలు గ్రామ సర్పంచ్ పోలవరపు లోవలక్ష్మి చిత్రపటం వద్ద గురువారం ఎమ్మెల్యే బాబూరావు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు పాలపర్తి పాపారావు, వైబోయిన పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు, మణిరాజు, బాబి, పినపాత్రుని ప్రసాదరావు పాల్గొన్నారు.

చదువు, సాంకేతికతతో ఉన్నత స్థాయి



శ్రీ గౌరీ గ్రంథాలయం వార్షికోత్సవంలో మాట్లాడుతున్న బుద్ధ చంద్రశేఖర్

తుమ్మపాల : చదువుతో పాటు వృత్తి నైపుణ్యం, ఆధునిక టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారి బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలో గవరపాలెం శ్రీగౌరీ గ్రంథాలయం 80వ వార్షికోత్సవం సందర్భంగా ఉన్నత విద్య, నైపుణ్యం, ఉపాధి అంశంపై గురువారం సాయంత్రం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేవలం చదువుపై మాత్రమే ఆధారపడిన అనేక మంది విద్యార్థులకు సమాజంలో అనేక అంశాలపై కనీస అవగాహన ఉండట్లేదని, చదువుతో పాటు అన్ని అంశాలపైనా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత ఆధునిక పోటీ ప్రపంచంలో చదువు మాత్రమే ప్రాధాన్యం కాదని, కనీసం ఏదో ఒక అంశంలో వృత్తి నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. మాధ్యమాల ద్వారా చదువుకునే ఈ తరుణంలో టెక్నాలజీ అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచే క్రీడలను అలవర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. నిరుద్యోగులకు శ్రీగౌరీ గ్రంథాలయం 80 ఏళ్లగా సేవలు అందిస్తూ, అనేక మంది ఉద్యోగాలు పొంది, ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడిందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా పాలకమండలి సభ్యులు ఆయన్ని సత్కంచారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారి భీశెట్టి కృష్ణఅప్పారావు, కన్వీనర్ మళ్ల బాపునాయుడు, విద్యార్థులు, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

10న కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట

అనకాపల్లిటౌన్ : మండలంలోని బట్లపూడి సోహం ఆశ్రమంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సోహం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవి చెప్పారు. గురువారం కనకదుర్గమ్మవారికి నీటి, పాలు, ధాన్యంతో అభిషేకాలు జరిగాయి. శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 10వ తేదీన కనదుర్గమ్మ విగ్రహాన్ని ఆశ్రమంలో ప్రతిష్ఠించనున్నట్టు వెల్లడించారు.

చిన్న వయసులో చికిత్సతో సత్ఫలితాలు



గ్రహణం మొర్రి చిన్నారిని పరిశీలిస్తున్న వైద్యుడు ముకుందరెడ్డి

అనకాపల్లిటౌన్ : గ్రహణం మొర్రి, గ్రహణ శూల బాధితులు చిన్న వయస్సులో శస్త్రచికిత్స చేయించుకోవడం ద్వారా సత్ఫలితాలుంటాయని హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి వైద్యుడు డి.ముకుందరెడ్డి అన్నారు. గవరపాలెం గౌరీగ్రంథాలయం ఆవరణలో ఏపీ సమగ్రశిక్ష-సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. అవసరమైన బాధితులకు శస్త్రచికిత్సలు నిర్వహించడమే కాకుండా రవాణా ఖర్చులు కూడా తామే భరిస్తామన్నారు. ఇదే ఆపరేషన్ ప్రైవేటుగా చేయించుకుంటే రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో 24 మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, ఎంఈవో దివాకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.